RNI No: APTEL/2021/80174



# మన జనప్రగతి

జనం కోసం. అక్షర ప్రగతి..

తెలుగు దినపత్రిక

www.manajanapragathi.com

managanapragthi@gmail.com

సంపుటి : 07 | సంచిక : 50 | పేజీలు : 08 | వెల : రూ. 2/ | 19-03-2024 | వైయస్ఆర్ కడప జిల్లా

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

### తెలంగాణలో బీజేపీకి ఎన్ని సీట్లు ఎక్కువ వస్తే...

# నాకు అంత శక్తి

## ప్రధాని మోదీ



హైదరాబాద్ మన జనప్రగతి మార్చి 18:- తెలంగాణలో బీజేపీకి ఎన్ని సీట్లు ఎక్కువ వస్తే.. తనకు అంత శక్తి వస్తుందని ప్రధాని మోదీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూలు వెలువడిన తర్వాత రాష్ట్రంలో తొలిసారి నిర్వహిస్తున్న జగిత్యాల విజయసంకల్ప సభలో ఆయన ప్రసంగించారు. దేశంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని.. భారత్ అభివృద్ధి చెందితే తెలంగాణలో కూడా అభివృద్ధి జరుగుతుందని అన్నారు.మే 13న తెలంగాణ ప్రజలు కొత్త చరిత్ర సృష్టించబోతున్నారని.. వికసిత్ భారత్ కోసం తెలంగాణ ప్రజలు ఓటు వేయబోతున్నారని మోదీ వెల్లడించారు. తెలంగాణలో బీజేపీ క్రమంగా బలపడుతోందిని.. మాల్కాజ్‌గిరిలో ప్రజలు బ్రహ్మరథం పట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు అబ్ కీ బార్.. 400 పార్ అంటున్నారని.. ఈ సారి పక్కాగా 400 సీట్లు సాధిస్తామన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ పార్టీపై ప్రజలకు ఉన్న ఆగ్రహం అసెంబ్లీ ఎన్నికల్లో బయటపడిందన్న మోదీ... తెలంగాణను దోచుకున్న వాళ్లను తాము వదిలిపెట్టమని హెచ్చరించారు. తమకు అధికారం కంటే ప్రజా సంక్షేమమే ముఖ్యమని వెల్లడించారు. తెలంగాణలో ఎన్నో వేల కోట్ల రూపాయాలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. తెలంగాణలో బీజేపీ అధికారంలో ఉంటే.. రాష్ట్రం మరెంతో అభివృద్ధి చెంది ఉండేదని అన్నారు. పసుపు రైతులను బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎప్పుడూ పట్టించుకోలేదని.. బీజేపీ ప్రభుత్వం మాత్రమే పసుపు రైతులకు మేలు చేసిందని -2లో

# ఏదీ దాచిపెట్టడానికి వీల్లేదు..

## ఎన్నికల బాండ్లపై ఎస్బీఐకి సుప్రీంకోర్టు ఆదేశం



న్యూ ఢిల్లీ మన మన జనప్రగతి మార్చి 18:- ఎన్నికల బాండ్ల వివరాలపై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి స్పష్టమైన ఆదేశాలు వెలువరించింది. రాజకీయ పార్టీలకు బాండ్ల రూపంలో ఇచ్చిన విరాళాలకు సంబంధించిన ఏదీ దాచిపెట్టడానికి లేదని, వాటిని కొనుగోలుచేసిన వ్యక్తులు, సంస్థల వివరాలను బహిర్గతం చేయాల్సిందేనని పునరుద్ఘాటించింది. ఎన్నికల బాండ్ల సీరియల్ నెంబర్ల సహా పూర్తి డేటాను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) గురువారంలోగా వెల్లడించాలని ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం సోమవారం స్పష్టం చేసింది.ఎస్బీఐ అసంపూర్తి డేటాను వెల్లడించదని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం.. 'మీవద్ద ఉన్న ఎన్నికల బాండ్లకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని బహిర్గతం చేయాలని మేము ఆదేశిస్తున్నాం' అని పేర్కొంది. ఎటువంటి సమాచారం దాచిపెట్టలేదని, డేటా మొత్తం అందజేసినట్టు తెలియజేస్తూ గురువారం సాయంత్రం 5 గంటల్లోగా అఫిడవిట్ సమర్పించాలని ఎస్బీఐ ఛైర్మన్ -2లో

# ప్లీజ్ మమ్మల్ని విడిపించండి..

## రష్యా సైన్యం చెరలోని భారతీయుల మరో వీడియో



న్యూ ఢిల్లీ మన జనప్రగతి మార్చి 18:- రష్యా పర్యటనకు వెళ్లిన కొందరు భారతీయులు ఊహించని విధంగా అక్కడి సైన్యాలకు చిక్కుకు పోయిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా సైన్యానికి బలవంతంగా సహాయకులుగా పనిచేస్తున్న వారిని విడిపించేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో తాజాగా బాధితులు మరో వీడియో విడుదల చేశారు. తమను చెర నుంచి విడిపించి, స్వదేశానికి తీసుకెళ్లాలని కేంద్రాన్ని వేడుకొన్నారు. రష్యా సైనిక దుస్తుల్లో ఉన్న ఆరుగురు భారతీయులు ఉక్రెయిన్‌లోని జపొరిజియా ఓబ్లాస్ట్ ప్రాంతంలో ఈ వీడియోను రికార్డు చేశారు. వీరంతా పంజాబ్, హరియాణా రాష్ట్రాలకు చెందిన వారిగా తెలుస్తోంది.'మోదీజీ మేం రష్యా సైన్యంలో చిక్కుకుపోయాం... భారత ప్రభుత్వం సహాయం కోసం ఇంతకు ముందు ఓ వీడియో ద్వారా అర్థించాం.. మన రెండు దేశాల మధ్య సత్సంబంధాలు ఉన్నాయని తెలుసు.. దయచేసి మాస్కోలోని భారత ఎంబసీని సంప్రదించి వీలైనంత త్వరగా మమ్మల్ని విడిపించండి.. ధన్యవాదాలు..!' అంటూ 26 సెకన్ల వీడియోలో వారు కేంద్రాన్ని వేడుకున్నారు. కాగా, మార్చి నెల ప్రారంభంలోనూ ఈ బాధితులు 105 సెకెన్ల నిడివి ఉన్న ఓ వీడియోను విడుదల చేశారు. తమను బలవంతంగా సైన్యంలో -2లో

# రష్యా అధ్యక్ష ఎన్నికలు పుతిన్ విజయం



న్యూ ఢిల్లీ మన జనప్రగతి మార్చి 18:- రష్యా అధ్యక్ష ఎన్నికల్లో హొవ్లాదిమిర్ పుతిన్ విజయం సాధించారు.పుతిన్ కు వ్యతిరేకంగా ఆయన ప్రత్యర్థులు పోలింగ్ స్టేషన్ల మధ్య నిరసనలు చేపట్టారు. 1999లో తొలిసారిగా పుతిన్ రష్యాకు అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు గతంలో సోవియట్ యూనియన్ అధ్యక్షుడిగా జోసెఫ్ స్టాలిన్ అత్యధిక కాలం పనిచేసిన నేతగా రికార్డు సాధించాడు. ప్రస్తుతం పుతిన్ వరునగా విజయాలు సాధిస్తున్నాడు. పుతిన్ కు 87.88 శాతం ఓట్లు దక్కినట్టుగా ఫలితాలు తెలుపుతున్నాయి. గతంలో సోవియట్ యూనియన్ అధ్యక్షుడిగా జోసెఫ్ స్టాలిన్ అత్యధిక కాలం పనిచేసిన నేతగా రికార్డు సాధించాడు. ప్రస్తుతం పుతిన్ వరుసగా విజయాలు సాధిస్తున్నాడు. పుతిన్ కు 87.88 శాతం ఓట్లు దక్కినట్టుగా ఫలితాలు తెలుపుతున్నాయి. సోషల్ మీడియాలో వైరలైన వీడియో కమ్యూనిస్టు అభ్యర్థి నికోలాయ్ ఖరిటోనోవ్ హొకు 4 శాతం కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. పుతిన్ తర్వాతి స్థానంలో కమ్యూనిస్టు అభ్యర్థి నిలిచారు. వ్లాడిస్లావ్ దావన్కోవ్ మూడో స్థానంలో నిలిచారు. అల్ట్రా నేషనలిస్ట్‌కు చెందిన లియోనిడ్ స్లట్స్కీ నాలుగోస్థానంలో నిలించారు. రష్యా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత రష్యన్ మిలటరీని మరింత బలోపేతం చేస్తానని పుతిన్ తన మద్దతుదారుల సమావేశంలో పేర్కొన్నారు. మన ముందు అనేక పనులున్నాయి... కానీ మనం ఏకమైన సమయంలో మనల్ని ఎవరూ భయపెట్టాలని, అణచి వేయాలని కోరుకున్నా చరిత్రలో విజయం సాధించలేరన్నారు.

### తెలంగాణ గవర్నర్...

# తమిళిసై రాజీనామా



హైదరాబాద్ మన జనప్రగతి మార్చి 18:- తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపించారు. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి సైతం ఆమె రాజీనామా చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బరిలోకి దిగేందుకు ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. తమిళనాడుకు చెందిన తమిళిసై.. ఈసారి ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. చెన్నై సెంట్రల్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున పోటీ చేసేందుకు గానూ.. రాజ్యాంగబద్ధమైన గవర్నర్ పోస్టుకు ఆమె రాజీనామా చేసినట్లు విశ్వసనీయవర్గాల -2లో

# 27 నుంచి జగన్ 'మేమంతా సిద్ధం'..


## మళ్లీ అదే సెంటిమెంట్ ఫాలో!



విజయవాడ మన జనప్రగతి మార్చి 18:-ఏపీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రచారాన్ని రెడీ అయ్యారు. ఇప్పటికే సిద్ధం సభలతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైఎస్ఆర్‌సీపీ శ్రేణుల్లో ఓ ఉత్సాహం తీసుకువచ్చారు జగన్ . ఇక అభ్యర్థుల ఎంపిక సైతం పూర్తి కావటంతో.. పూర్తిగా ప్రచారం మీదే ఫోకస్ పెట్టారు. అందులో భాగంగా మార్చి 27 వ తేదీ నుంచి జగన్ ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్లు సమాచారం. మేమంతా సిద్ధం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టనున్నట్లు తెలిసింది. ఇడుపులపాయ నుంచి ప్రారంభం కానున్న బస్సు యాత్ర శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగియనుంది. మొత్తం 21 రోజులపాటు జరిగే బస్సు యాత్రలో .. అన్ని నియోజవర్గాలను కవర్ చేసేలా వైసీపీ శ్రేణులు రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్లు తెలిసింది.బస్సుయాత్రలో ప్రతి నియోజకవర్గాన్ని చుట్టేసేలా జగన్ ప్లాన్ చేస్తున్నారట. అలాగే ప్రతిరోజూ ఒక బహిరంగసభలో జగన్ పాల్గొనేలా రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. తొలి విడతలో బస్సు యాత్ర చేపట్టనున్న జగన్.. ఆ తర్వాత ఎన్నికల ప్రచార సభలలో పాల్గొంటారు. మరోవైపు ఎన్నికల ప్రచారం సమయంలోనూ జగన్ ఓ సెంటిమెంట్ ఫాలో అవుతున్నారు. 2019 ఎన్నికల సమయంలో ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ వద్ద నివాళులు అర్పించి అభ్యర్థులను ప్రకటించారు జగన్. నాటి ఎన్నికల్లో 151 అసెంబ్లీ, 22 ఎంపీ సీట్లలో వైసీపీ విజయఢంకా మోగించింది. ఇక ఈసారి కూడా అప్పటిలాగే ఇడుపులపాయలోనే అభ్యర్థుల జాబితా విడుదల చేశారు. ఇక బస్సు యాత్ర విషయానికి వస్తే వైఎస్ జగన్ పాదయాత్ర ప్రారంభమైన దగ్గర నుంచే.. ఇప్పటి బస్సుయాత్ర కూడా ప్రారంభం కానుంది. ఇడుపులపాయ నుంచే జగన్ బస్సు యాత్ర ప్రారంభం కానున్నట్లు సమాచారం. అలాగే పాదయాత్ర ముగించిన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వద్దనే బస్సుయాత్ర సైతం పూర్తయ్యేలా వైసీపీ రూట్ మ్యాప్ సిద్ధం చేస్తోంది. మేమంతా సిద్ధం అంటూ జరిగే ఈ బస్సు యాత్ర ద్వారా ఐదేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని జగన్.. ప్రజలకు వివరించనున్నారు. అలాగే ఎన్డీయే కూటమిని టార్గెట్‌గా చేసుకుని ప్రచారం నిర్వహించనున్నారు.

# కునోలో ఆరు పిల్లలకు జన్మనిచ్చిన గామిని..

## వరల్డ్ రికార్డు నమోదు




న్యూ ఢిల్లీ మన జనప్రగతి మార్చి 18:- ఇటీవల మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్‌లో ఆడ చిరుత గామిని 5 కాదు 6 పిల్లలకు జన్మనిచ్చింది. మార్చి 10న పిల్లల సంఖ్య 5 అని నివేదించబడింది. సోమవారం కేంద్ర అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ పిల్లల వీడియోను పంచుకుంటూ, నవజాత శిశువుల సంఖ్య 6 అని చెప్పారు. దీంతో పాటు 6 పిల్లలకు జన్మనిచ్చి గామిని పేరిట రికార్డు కూడా నమోదైంది. ఆడ చిరుత గామినిని దక్షిణాఫ్రికా నుంచి తీసుకొచ్చారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో వీడియోను పంచుకున్న కేంద్ర అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్, "చాలా సంతోషంగా ఉంది. ఇవి ఐదు కాదు. ఆరు పిల్లలు!" గామిని ఐదు పిల్లలకు జన్మనిచ్చిన వార్త తర్వాత ఒక వారం తర్వాత దక్షిణాఫ్రికా చిరుత తల్లి గామిని ఆరు పిల్లలకు జన్మనిచ్చిందని ఇప్పుడు ధృవీకరించబడింది. ఇది మొదటిసారి తల్లికి ఒక రకమైన రికార్డు. తొలిసారి తల్లి అయిన గామిని.. 6 పిల్లలకు జన్మనిచ్చిన తొలి ఆడ చిరుతగా నిలిచింది. ఇప్పటివరకు గరిష్ట సంఖ్య 5 మాత్రమే అన్నారు. భారతదేశంలో చిరుతలను స్థిరపరచడానికి ప్రాజెక్ట్ చిరుత ప్రారంభించబడింది. దీని కింద నమీబియా, దక్షిణాఫ్రికా నుండి 2 దశల్లో 20 చిరుతలను తీసుకువచ్చారు. వీటిలో మొత్తం 7 చిరుతలు చనిపోయాయి. కాగా కునోలో పుట్టిన 13 పిల్లలు చనిపోయాయి. కునోలో మొత్తం చిరుతపులుల సంఖ్య ఇప్పుడు 27కి చేరుకుంది. గామిని పిల్లలు పుట్టకముందే ఈ ఏడాది జనవరిలో ఆడ చిరుత ఆశా 3 పిల్లలకు జన్మనిచ్చింది.

# ప్రతి మహిళ శక్తి రూపంలో కన్పిస్తుంది

## జగిత్యాల సభలో రాహుల్ వ్యాఖ్యలకు మోడీ కౌంటర్



జగిత్యాల మన జనప్రగతి మార్చి 18:- జగిత్యాల: తనకు ప్రతి మహిళా ఒక శక్తి స్వరూపంలో కన్పిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పారు. జగిత్యాలలో సోమవారం నాడు జరిగిన బీజేపీ విజయసంకల్ప సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఎన్నికల పండగ మొదలైందన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య ఉత్సవం ప్రారంభమైందని మోడీ చెప్పారు. తెలంగాణలో బీజేపీకి ప్రజలు పెద్ద ఎత్తున మద్దతిస్తున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. జగిత్యాలలో సోమవారం నాడు జరిగిన బీజేపీ విజయసంకల్ప సభలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పాల్గొన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఎన్నికల పండగ మొదలైందన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య ఉత్సవం ప్రారంభమైందని మోడీ చెప్పారు. శక్తిని వినాశనం చేస్తానని ఎవరైనా అంటారా అని మోడీ ప్రశ్నించారు. శక్తి వినాశనం చేసేవాళ్లకు.. శక్తి పూజ చేసే వాళ్లకు మధ్య పోరాటం జరుగుతుందని మోడీ పేర్కొన్నారు. శక్తి రూపంలో మహిళలు తనను ఆశీర్వదించేందుకు వచ్చారు.. ఇది తన భాగ్యమని మోడీ తెలిపారు. శక్తి స్వరూపులైన ప్రతి మాత, సోదరి, కుమార్తెల పూజారినని మోడీ చెప్పారు. శక్తి స్వరూపులైన మహిళల రక్షణ కోసం తాను ప్రాణాలు అర్పించేందుకు సిద్ధంగా ఉన్నానని మోడీ పేర్కొన్నారు. తాను భారతమాత పూజారిగా మోడీ తెలిపారు. ముంబై శివాజీ మైదానంలో రాహుల్ గాంధీ చేసిన ప్రసంగాన్ని మోడీ ప్రస్తావించారు. తన పోరాటం శక్తికి వ్యతిరేకమని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారని మోడీ గుర్తు చేశారు. శక్తిని ఖతం చేస్తానని రాహుల్ గాంధీ చేసిన ఛాలెంజ్‌ను స్వీకరిస్తున్నానని మోడీ వివరించారు. చంద్రయాన్ విజయవంతమైన ప్రాంతాన్ని కూడ శివశక్తి అని పేరు పెట్టుకున్న విషయాన్ని మోడీ గుర్తు చేశారు. శక్తిని నాశనం చేసేవారికి, శక్తిని పూజించేవారికి మధ్య పోరాటం సాగుతుందన్నారు. శక్తి ఆశీర్వాదం ఎవరికి ఉందో జూన్ 4న తేలుతుందని మోడీ పేర్కొన్నారు. ఈవీఎం, ఐటీ, ఈడీలే అని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను మోడీ ప్రస్తావించారు.

# ప్లీజ్ మమ్మల్ని విడిపించండి..

(మొదటిపేజీ తరువాయి)

సహాయకులుగా చేర్పించారని వాపోయారు. 'హెల్పర్లుగా మాత్రమే పనిచేయాలని తొలుత చెప్పారు. కానీ, ఆ తర్వాత సాయుధ శిక్షణలో పేరు నమోదు చేశారు.. ఉక్రెయిన్‌లోకి పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.. మాకు ఆహారం కూడా పెట్టడంలేదు.. మొబైల్ ఫోన్లు లాక్కొన్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. తాజా వీడియోతో వారిని యుద్ధభూమిలోకి పంపినట్లు స్పష్టమవుతోంది. కాగా, బాధితులు గత డిసెంబరు 27న కొత్త ఏడాది వేడుకలు జరుపుకోడానికి రష్యా వెళ్లినట్లు తెలిసింది. ఏజెంట్ చేతిలో మోసపోయిన వీరు రష్యా ఆర్మీకి చిక్కారు. 90 రోజుల వీసాపై మాస్కోకు వెళ్లిన తమను ఏజెంట్ బెలారస్‌కు తీసుకెళ్లినట్లు బాధితుల్లో ఒకరైన హరియాణాకు చెందిన 19 ఏళ్ల హర్ష్ గత వీడియోలో తెలిపారు. అక్కడ ఆ ఏజెంట్ తమను వదిలేసి పోయాడని, స్థానిక పోలీసులు పట్టుకుని రష్యా అధికారులకు అప్పగించారని తమ గోడు వెళ్లబోసుకున్నారు. 'వీసా అవసరమని మాకు తెలియదు. మేము బెలారస్‌కు వెళ్లినప్పుడు (వీసా లేకుండా) ఏజెంట్ మమ్మల్ని మరింత డబ్బు అడిగాడు.. అక్కడ వదిలిపెట్టాడు. పోలీసులు మమ్మల్ని పట్టుకుని రష్యా అధికారులకు అప్పగించారు.. వారు మాతో పత్రాలపై సంతకం చేయించారు.. ఇప్పుడు ఉక్రెయిన్‌పై యుద్ధంలో పోరాడాలని మమ్మల్ని బలవంతం చేస్తున్నారు' అని హర్ష్ కన్నీటిపర్యంతమయ్యాడు. హర్ష్ విదేశాల్లో ఉద్యోగాల కోసం వెతుకుతున్నాడని, రష్యా మీదుగా వెళితే తనకు నచ్చిన దేశానికి వలస వెళ్లడం సులభమవుతుందని చెప్పినట్టు అతడి కుటుంబం గతంలో తెలిపింది. 'నా కొడుకు డిసెంబర్ 23న విదేశాలకు వెళ్లాడు.. ఉద్యోగం వెతుక్కుంటూ రష్యాలో పట్టుబడ్డాడు.. అక్కడ అతడి పాస్‌పోర్ట్ లాక్కున్నాడు. రష్యా సైనికులు తమను పట్టుకున్నారని, పదేళ్ల జైలు శిక్ష విధిస్తామని బెదిరించి రిక్రూట్ చేసుకున్నారని మాకు చెప్పాడు.. అతను బలవంతంగా సైనిక శిక్షణ పొందాడని చెప్పాడు'అని అతడి తల్లి పేర్కొంది. నా కొడుకును క్షేమంగా ఇంటికి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరింది. కాగా, భారత్ నుంచి దాదాపు 100 మంది యువకులను ఉద్యోగం పేరుతో రష్యాకు తరలించి ఉక్రెయిన్‌తో యుద్ధంలోకి నెట్టారన్న సమాచారంపై ఇటీవల కేంద్రం స్పందించింది. మాస్కోతో చర్చలు జరిపి కొంత మందిని విడిపించినట్లు పేర్కొంది. మరికొందరు అక్కడే పనిచేస్తున్నారని, వారినీ బయటకు తీసుకొచ్చేందుకు రష్యా అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నామని కేంద్ర విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు.

# తెలంగాణలో బీజేపీకి ఎన్ని సీట్లు ఎక్కువ వస్తే...

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ తెలంగాణను దోచుకుంటే.. ఇప్పుడు కొత్తగా వచ్చిన కాంగ్రెస్ రాష్ట్రాన్ని ఏటీఎంలా మార్చుకుంటోందని విమర్శించారు. బీఆర్ఎస్‌పై అవినీతి ఆరోపణలు చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ఆ ఫైల్స్‌ను పక్కన పెడుతోందన్నారు. కాళేశ్వరం అవినీతిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మకయ్యాయని.. లిక్కర్ స్కామ్‌లోనూ బీఆర్ఎస్ కమీషన్లు తీసుకుందని మోదీ ఆరోపించారు. ఆ రెండు పార్టీలు తనను దూషించటమే పనిగా పెట్టుకున్నాయని అన్నారు. తెలంగాణ నుంచి దోచిన డబ్బులు ఢిల్లీలో కుటుంబ పార్టీ పెద్దలకు వెళ్తున్నాయన్నారు. దేశంలో జరిగిన స్కామ్‌లన్నింటికీ కుటుంబ పార్టీలే కారణమని అన్నారు. రాహుల్ అగ్రనేత రాహుల్ గాంధీపైనా మోదీ విమర్శలు గుప్పించారు. శివాజీ మైదానంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ తన పోరాటం శక్తికి వ్యతిరేకం అని చెప్పారని గుర్తు చేశారు. శక్తిని వినాశనం చేసేవాళ్లకు.. శక్తికి పూజ చేసే వాళ్లకు మధ్య పోరాటం జరగబోతుందన్నారు. శక్తిని ఖతమ్ చేస్తామన్న రాహుల్ గాంధీ ఛాలెంజ్‌ను తాను స్వీకరిస్తున్నట్లు మోదీ వెల్లడించారు. చంద్రయాన్ విజయవంతమైన ప్రాంతానికి కూడా శివశక్తి అని పేరు పెట్టామని.. శక్తి ఆశీర్వాదం ఎవరికి ఉందో.. జూన్ నాలుగో తేదీన తెలుస్తుందని అన్నారు. తాను భారతమాతకు పూజారిని అంటూ మోదీ వ్యాఖ్యానించారు.

# తెలంగాణ గవర్నర్...

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం. తమిళిసై పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేస్తారనే ప్రచారం ఎప్పట్నుంచో సాగుతోంది. తన సొంత రాష్ట్రం తమిళనాడు నుంచి బరిలో దిగేందుకు ఆమె ఆసక్తి చూపుతున్నారనే వార్తలు వచ్చాయి. చెన్నై సెంట్రల్ లేదా తూత్తుకుడి నుంచి ఆమె పోటీ చేయనున్నట్లు ప్రచారం జరిగింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆమె తూత్తుకూడి నుంచి పోటీచేసి డీఎంకే అభ్యర్థి కనిమొళి చేతిలో ఓటమి చవిచూశారు. 2006 నుంచి తమిళిసై ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్నా.. ఇంత వరకూ ఒక్కసారి కూడా విజయాన్ని అందుకోలేకపోయారు. వృత్తిరీత్యా గైనకాలజిస్ట్ అయిన తమిళిసై బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై 1999లో ఆ పార్టీలో చేరారు. తమిళనాడులో బీజేపీ బలోపేతం కావటంలో ఆమె పాత్ర కీలకమైంది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షురాలిగా, జాతీయ కార్యదర్శిగా పలు పదవులను నిర్వహించారు. 2006 ఎన్నికల్లో రామనాథపురం నియోజవర్గం నుంచి తొలిసారి ఆమె అసెంబ్లీకి పోటీ చేయగా ఓటమి ఎదురైంది. 2009 లోక్‌సభ ఎన్నికల్లో నార్త్ చెన్నై నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి మరోసారి ఓడిపోయారు. 2011 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో వేళచ్చేరి నుంచి పోటీచేసి నాలుగో స్థానానికి పరిమితమయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమి నేతృత్వంలో తూత్తుకుడి నుంచి పోటీ చేయగా.. మరోసారి కూడా ఓటమి ఎదురయ్యింది. అనంతరం 2019లోనే తెలంగాణ గవర్నర్‌గా నియమితులయ్యారు. పుదుచ్చేరి ఇన్‌ఛార్జి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ కేంద్రం అదనపు బాధ్యతలను అప్పగించింది. తెలంగాణ గవర్నర్‌గా నియామకం అయిన తొలినాళ్లలో కేసీఆర్ ప్రభుత్వంతో సఖ్యతతోనే ఉన్న తమిళిసై ఆ తర్వాత తన నిర్ణయాలతో ప్రభుత్వానికి దూరమైంది. కేసీఆర్ ప్రభుత్వం ప్రోటోకాల్ పాటించటం లేదని బహిరంగంగానే విమర్శించింది. ప్రభుత్వం పంపిన వివిధ బిల్లులను తిప్పి పంపటంతో పాటు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకానికి అభ్యంతరం చెప్పారు. అలా గవర్నర్‌కు ప్రభుత్వానికి మధ్య గ్యాప్ ఏర్పడింది. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయి.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా.. రేవంత్ ప్రభుత్వంతో ఆమె సఖ్యతగానే మెలిగారు. అయితే గత కొంత కాలంగా ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లో తిరిగి యాక్టివ్ అయ్యేందుకు ప్రయత్నాలు చేశారు. ఈమేరకు పలుమార్లు ఢిల్లీకి వెళ్లి అదిష్ఠానంతో మట్లాడారు కూడా. ఈ నేపథ్యంలోనే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు గాను గవర్నర్ పదవికి రాజీనామా చేసినట్లు తెలిసింది. చెన్నై సెంట్రల్ లేదా తుత్తూకూడి నుంచి ఆమెను అభ్యర్థిగా బరిలోకి దింపాలని బీజేపీ యోచిస్తున్నట్లు తెలిసింది.

# ఏదీ దాచిపెట్టడానికి

(మొదటిపేజీ తరువాయి)

అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆదేశించింది. అలాగే, ఎస్బీఐ ఇచ్చిన వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సూచించింది. కాగా, గత నెలలో ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దుచేసిన అత్యున్నత న్యాయస్థానం.. గత ఐదేళ్లలో బాండ్లను కొనుగోలు చేసిన వ్యక్తులు, సంస్థలు వివరాలను వెల్లడించాలని తేల్చిచెప్పింది. 'ఏం వెల్లడించాలో మీరు మాకు చెప్పండి... మేము వెల్లడిస్తాం' అన్నట్లుగా ఎస్బీఐ వైఖరి ఉంది. అది సరైంది కాదు. మేము అన్ని వివరాలు" అని చెప్పినప్పుడు డేటా అంతా అని అర్థం' అని సీజేఐ అసహనం వ్యక్తం చేశారు. 'ప్రతి సమాచారం బయటకు రావాలి.. వివరాలన్నీ బయటకు రావాలి. ఏదీ అణచివేయబడలేదని మేము నిర్ధారించాలనుకుంటున్నాం' అని వ్యాఖ్యానించారు

# తెలంగాణను దోచుకున్నది చాలక ఢిల్లీ వెళ్లి స్కామ్ చేశారు


## కిషన్‌రెడ్డి



హైదరాబాద్ మన జనప్రగతి మార్చి 18:- తెలంగాణలో అత్యధిక స్థానాలకు కైవసం చేసుకునేందుకు బీజేపీ పక్కావ్యూహంతో ముందుకువెళ్తోంది. దీనిలో భాగంగా జగిత్యాల వేదికగా బీజేపీ విజయసంకల్ప సభను నిర్వహించింది. జగిత్యాల విజయసంకల్ప సభలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై మండిపడ్డారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి. తెలంగాణను దోచుకున్నది చాలదన్నట్లు మద్యం కుంభకోణంతో తెలంగాణ పరువు తీశారని ధ్వజమెత్తారు. తెలంగాణ సమాజం తలదించుకునేలా..కేసీఆర్ కుటుంబం వ్యవహరించిందంటూ మండిపడ్డారు. పదేళ్లు బిఆర్ఎస్ రాష్ట్రాన్ని దోచుకుందని.. కేసీఆర్ కుటుంబం భారీగా అవినీతికి పాల్పడిందని తెలిపారు. తెలంగాణను దోచుకున్నది చాలక.. ఢిల్లీ వెళ్లి లిక్కర్ స్కామ్ చేశారంటూ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ బాటలోనే నడుస్తోందని విమర్శించారు కిషన్‌రెడ్డి. వందరోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి.. మాట తప్పిందని మండిపడ్డారు. ఒకటో, రెండో గ్యారంటీలు అమలు చేసి.. మొత్తం చేశామని అబద్ధాలు చెప్పడం కాంగ్రెస్‌కే చెల్లుందని ఆరోపించారు కిషన్‌రెడ్డి. గ్యారంటీల కాంగ్రెస్ మోసం చేసిందంటూ విమర్శించారు. నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకుసాగుతుందని కిషన్ రెడ్డి తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు నుంచి.. రామమందిరం నిర్మాణం వరకు ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు

# తిరుమల వెళ్లే భక్తులకు ముఖ్య గమనిక

## ఈ విషయం తెలుసా, ఈ వారంలో ఐదు రోజులు!



తిరుమల మన జనప్రగతి మార్చి 18:- తిరుమల శ్రీవారి భక్తులకు ముఖ్యమైన గమనిక. తిరుమలలో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయం పక్కనే ఉన్న పుష్కరిణిలో ఉత్సవర్లు విహరించే తెప్పను ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేశారు. నీటిపై గాలితో కూడిన డ్రమ్ములను ఏర్పాటు చేసి, దానిపై మండపం రూపంలో ఉండే తెప్పను నిర్మించి.. రంగులు అద్దుతున్నారు. తిరుమల శ్రీవారి వార్షిక తెప్పోత్సవాల కారణంగా పలు సేవల్ని రద్దు చేశారు. మార్చి 20, 21వ తేదీల్లో సహస్ర దీపాలంకార సేవను రద్దు చేశారు. అంతకాదు మార్చి 22, 23, 24వ తేదీల్లో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను రద్దు చేసినట్లు టీటీడీ తెలిపింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని టీటీడీ సూచించింది. తొలిరోజున సీతా లక్ష్మణ ఆంజనేయ సమేతంగా రామచంద్రమూర్తి తెప్పపై మూడు చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేస్తారు. రెండో రోజున రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామివారు తెప్పలపై మూడుసార్లు విహరిస్తారు. మూడో రోజున శ్రీభూ సమేతంగా మలయప్పస్వామి మూడుసార్లు పుష్కరిణిలో విహరించి, భక్తులను అనుగ్రహిస్తారు. నాల్గవ రోజున ఐదుసార్లు, చివరిరోజు ఏడుసార్లు తెప్పపై పుష్కరిణిలో విహరిస్తారు. తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలలో ప్రతి రోజు రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు పుష్కరిణిలో స్వామి, అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఏప్రిల్ 5 నుంచి 13వ తేదీ వరకు శ్రీ కోదండ రామస్వామివారి బ్రహ్మోత్సవాలు తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 5 నుండి 13వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ఇందులో భాగంగా ఆలయంలో ఏప్రిల్ 3న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, ఏప్రిల్ 4న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహిస్తారు. వాహన సేవలు ప్రతిరోజు ఉదయం 7 నుండి 8:30 గంటల వరకు, రాత్రి 7 నుండి 8:30 గంటల వరకు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా.. ఏప్రిల్ 5న ఉదయం - ధ్వజారోహణం.. రాత్రి - పెద్దశేష వాహన సేవలు ఉంటాయి. ఏప్రిల్ 6న ఉదయం- చిన్నశేష వాహనం.. రాత్రి - హంస వాహనం ఉంటుంది. ఏప్రిల్ 7నఉదయం - సింహ వాహనం.. రాత్రి - ముత్యపుపందిరి వాహన సేవలు ఉంటాయి. ఏప్రిల్ 8న ఉదయం - కల్పవృక్ష వాహనం.. రాత్రి - సర్వభూపాల వాహనంపై స్వామివారు విహరిస్తారు. ఏప్రిల్ 9న ఉదయం - పల్లకీ ఉత్సవం.. రాత్రి - గరుడ వాహన సేవలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 10న ఉదయం - హనుమంత వాహనం.. రాత్రి - గజ వాహనం సేవలు ఉంటాయి. ఏప్రిల్ 11న ఉదయం - సూర్యప్రభ వాహనం.. రాత్రి - చంద్రప్రభ వాహనంపై స్వామివారు ఊరేగుతారు. ఏప్రిల్ 12న ఉదయం - రథోత్సవం.. రాత్రి - అశ్వవాహనంపై స్వామివార కటాక్షిస్తారు. ఏప్రిల్13న ఉదయం - చక్రస్నానం ధ్వజావరోహణం నిర్వహిస్తారు. ఏప్రిల్ 5న తిరుమలలో 521వ అన్నమయ్య వర్ధంతిదకవితా పితామహుడు శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యల 521వ వర్ధంతి కార్యక్రమం ఏప్రిల్ 5న తిరుమలలో టీటీడీ ఘనంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయం నుండి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఊరేగింపుగా బయల్దేరి సాయంత్రం 5.30 గంటలకు నారాయణగిరి ఉద్యానవనాలకు చేరుకుంటారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం నిర్వహించనున్నారు.

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయండి

## స్పీకర్‌కు బిఆర్ఎస్ శాసనసభాపక్షం ఫిర్యాదు



హైదరాబాద్ మన జనప్రగతి మార్చి 18:- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ శాసనసభాపక్షం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ హైదర్‌గూడలోని స్పీకర్ నివాసానికి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం పార్టీ ఫిరాయించిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు పిటిషన్‌ను అందజేశారు. స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం ఆ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లో చేర్పించుకొని ఆనందం పొందుతున్నాడని మండిపడ్డారు. 'నువ్వు కొట్టినావ్ మేము తీసుకున్నాం.. మేము కొట్టినప్పుడు రేవంత్ రెడ్డి.. నువ్వు లేవకుండా పోతావ్.' అని ఘాటు కామెంట్స్ చేశారు. సింహం ఒక అడుగు వెనక్కి వేసిందంటే.. తిరిగి నాలుగు అడుగు ముందుకు దూసుకు వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. బీఆర్ఎస్‌కు భారీ షాక్.. కాంగ్రెస్ గూటికి దానం, రంజిత్ రెడ్డి కాగా, ఆదివారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఇద్దరూ ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దాంతో దానంపై అనర్హత వేటు వేయాలని ఇవాళ గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కలిసి పిటిషన్ ఇచ్చారు. అయితే ఈ పిటిషన్‌పై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తిగా మారింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాల్లో పెద్దగా ప్రభావం చూపకపోయినా.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రం సత్తా చాటింది. అన్ని స్థానాలు కైవసం చేసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి రేవంత్ మంత్రివర్గంలో ఎవరికీ ప్రాతినిధ్యం లేదు. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ మంత్రి పదవి ఆఫర్‌తోనే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే కాకుండా దానంను సికింద్రాబాద్ ఎంపీగా బరిలోకి దింపేందుకు కాంగ్రెస్ రెడీ అయినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

# అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి పనులు ప్రారంభిస్తాం

## టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్



మంగళగిరి మన జనప్రగతి మార్చ్ 18:- అప్పులతో కాకుండా అభివృద్ధి చేసి రాష్ట్ర ఆదాయం ద్వారా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలన్నది తెలుగుదేశం పార్టీ విధానమని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూలు వెలువడిన నేపథ్యంలో మంగళగిరి నియోజకవర్గం ఆత్మకూరు మిడ్ వ్యాలీ సిటీలో బ్రేక్ ఫాస్ట్ విత్ లోకేష్ అనే కార్యక్రమంతో యువనేత ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో లోకేష్ తో పాటు గుంటూరు పార్లమెంటు టిడిపి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 2014లో చంద్రబాబునాయుడు సున్నాతో పాలన ప్రారంభించారని, గత అయిదేళ్లలో జగన్ విధ్వంస పాలన కారణంగా 30ఏళ్లు వెనక్కివెళ్లిందని చెప్పారు. అయినప్పటికీ రాష్ట్రాభివృద్ధికి అవసరమైన సమగ్ర ప్రణాళిక తమ వద్ద ఉందని తెలిపారు. పరిశ్రమలు రప్పించడం ద్వారా లక్షల ఉద్యోగాలు కల్పిస్తే రాష్ట్ర ఆదాయం రెట్టింపు అవుతుందని, చంద్రబాబు ఆలోచనల మేరకు 20లక్షలు ఉద్యోగాలు కల్పించడం ద్వారా రెండున్నర రెట్లు పెరుగుతుందని చెప్పారు. ఆదాయం పెంపుదల ద్వారా ఇప్పటికంటే మెరుగైన సంక్షేమాన్ని ప్రజలకు అందించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసిన వ్యక్తి అన్న ఎన్టీఆర్. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి విద్యావంతులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉంది. జగన్ మూడు ముక్కలాటతో తీవ్రంగా నష్టపోయాం. అటు విశాఖ, ఇటు అమరావతి, కర్నూలు ఏదీ అభివృద్ధి చెందలేదు. రాష్ట్రంలో పరిస్థితులు బీహార్ కంటే దారుణంగా తయారయ్యాయి.

# ప్రధాని సభలో మైకులు పనిచేయలేదు

## రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్



రాజమండ్రి మన జనప్రగతి మార్చి 18:- చిలకలూరిపేటలో జరిగిన టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి బహిరంగసభపై సెటైర్లు వేశారు రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ సభలో చంద్రబాబు ప్రత్యేక హోదాను ఎందుకు అడగలేదు ? అని ప్రశ్నించిన ఆయన.. చిలకలూరిపేటలో జరిగిన సభ ఫ్లాప్ అయ్యిందన్నారు.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభలో మైకులు పనిచేయలేదు.. అంటే.. పరిస్థితులు, దేవుడు వారి పక్షాన లేదని వ్యాఖ్యానించారు. ఇక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసింది బీజేపీ అని దుయ్యబట్టారు.. టీడీపీ, బీజేపీ, జనసేన కలయిక అక్రమ కలయికగా మండిపడ్డారు.. గతంలో చంద్రబాబు.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీని చాలా అనరాని మాటలు అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు కలిసి రాష్ట్రాన్ని నరేంద్ర మోడీకి తాకట్టు పెట్టాలనుకుంటున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏం సహాయం చేశారని ఎన్డీఏలో కలుస్తున్నారు? అని ప్రశ్నించారు ఎంపీ మార్గాని.. విలువలు విశ్వసనీయత అనే పదాలు చంద్రబాబు జీవితంలో తెలుసుకోలేరన్న ఆయన.. పవన్ కల్యాణ్, చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ఆలోచించే వ్యక్తులు కాదన్నారు. పార్లమెంట్‌లో పాస్ అయిన బిల్లులకు కూడా ఈ రోజుకి అతిగతి లేదన్నారు. విభజన హామీలను ఇంకా అమలు చేయలేదన్నారు. మోసం చేయడం అనేది చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యగా విమర్శించారు. మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి ఇంటికి పెద్ద కొడుకు లాగా వ్యవహరిస్తున్నారు.. రాజమండ్రిలో గంజాయి బ్యాచ్ కి డాన్ ఆదిరెడ్డి శ్రీనివాస్ అని ఆరోపించారు. అధిక వడ్డీలతో పేదవాళ్ల స్థలాలు లాక్కున్న చరిత్ర ఆదిరెడ్డి కుటుంబానిదని దుయ్యబట్టారు.. నా గురించి మాట్లాడే అర్హత నీకు లేదన్నారు. రాజమండ్రిలో గంజాయి బ్లేడు బ్యాచ్‌లు నడుస్తున్నరాయంటే.. దానికి కారణం ఆదిరెడ్డి కుటుంబమే నంటూ సంచలన ఆరోపణలు చేశారు రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్.

# వైసీపీకి మరో మారు అవకాశం ఇవ్వండి

## ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి



ప్రొద్దుటూరు, మన జనప్రగతి మార్చి 18:- వైసీపీ కి మరో మారు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి కోరారు. గత 30 రోజులుగా ఆయన నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం సోమవారం 36 వ వార్డులో సాగింది. ఈ సందర్భంగా రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి వారి సతీమణి రాచమల్లు రమాదేవికి రాయలసీమ పోలీస్ కంప్లైంట్ అథారిటీ బోర్డు మెంబర్ కాకర్ల నాగశేష రెడ్డి, కౌన్సిలర్ అలవలపాటి అరుణ దేవి, అలవలపాటి పురుషోత్తం రెడ్డి, వైయస్ఆర్సీపీ నాయకులు మరియు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రచారానికి 36 వ వార్డు ప్రజలు అపూర్వ ఆదరణ చూపించారు. ప్రతి గడపలో అందిన జగనన్న సంక్షేమ పథకాల కొనసాగేందుకు తాము తిరిగి వైసీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకుంటామని ప్రజలు తెలిపారు. మరొకమారు తనకు ఎమ్మెల్యేగా, ఎంపీగా అవినాష్ రెడ్డికి, సీఎంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అవకాశం కల్పించాలని, మంచి చేసి ఉంటేనే ఆదరించాలని వైసీపీ ప్రొద్దుటూరు శాసనసభ అభ్యర్థి రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి వార్డు లోని, ప్రతి గడపకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భీమునిపల్లె లక్ష్మీదేవి నాగరాజు, వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, వైసీపీ నాయకులు సానపురెడ్డి ప్రతాపరెడ్డి, లక్కిరెడ్డి పవన్ రెడ్డి, పాతకోట బలరామిరెడ్డి, రాయపురెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువతే మనోడి టార్గెట్..

## బుట్టలో పడితే ఇక అంతే

## 400 మందిపైనే బాధితులు!



హైదరాబాద్ మన జనప్రగతి మార్చి 18:- ఇటీవల కాలంలో రకరకాల మోసాలు వెలుగుచూస్తున్నాయి. అమాయకులే టార్గెట్‌గా కేటుగాళ్లు వల విసురుతున్నారు. తాజాగా.. హైదరాబాద్‌లో ఓ ఘరానా మోసం వెలుగు చూసింది. యవతే టార్గెట్‌గా ఓ కేటుగాడు మోసాలకు పాల్పడుతున్నాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నిరుద్యోగులను నిండా ముంచేశాడు. వివరాల్లోకి వెళితే.. అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణం బండ్లవంక ప్రాంతానికి చెందిన రెడ్డి సూర్యప్రసాద్ అలియాస్ భరత్ హైదరాబాద్, బెంగళూరుల్లో ఉంటూ నిరుద్యోగులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని వల వేశాడు. అతడి మాటలు నమ్మిన కొందరు యువత రెస్యూమోలు పంపించారు. పంపిన బయోడేటాల ఆధారంగా ముందుగా డిపాజిట్ రూపంలో కొంత డబ్బు చెల్లిస్తే నెలకు రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు శాలరీ వచ్చే ఉద్యోగాలు ఇప్పిస్తామని వారిని నమ్మించాడు. నిరుద్యోగుల్లో నమ్మకం కలిగించి ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేశాడు. 2 నెలల పాటు తన బినామీ కంపెనీ నుంచే వేతనాలిచ్చి బోర్డు తిప్పేశాడు. గుంటూరు, ప్రకాశం, అన్నమయ్య, అనంతపురం, చిత్తూరు, వైయస్ఆర్ జిల్లాల్లోని 400 మందికిపైగా నిరుద్యోగులు ఇతడి వలలో చిక్కుకొని మోసపోయారు. బాధితులు పోలీసులను ఆశ్రయించగా.. పీలేరు పోలీసులు అతడిని హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. హైదరాబాద్‌కు చెందిన పలువురు కూడా అతడి వలలో చిక్కుకొని మోసపోయినట్లు తెలిసింది.

# టిడిపి జనసేన బిజేపి జెండాలు, అజెండాలు వేరు

## ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి



ప్రొద్దుటూరు మన జనప్రగతి మార్చి 18:- టిడిపి జనసేన బిజేపి జెండాలు, అజెండాలు వేరని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్థానిక వైఎంఆర్ కాలనీలోని వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి జనసేన బిజేపి జెండాలు, అజెండాలు వేరని, టిడిపికి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం అజెండా అని, జనసేన కు జగన్ ను ఓడించడమే అజెండా అయితే, బిజేపి కి భారతదేశంలో వారి పాలన కొనసాగడమే ధ్యేయమన్నారు. మూడు పార్టీలు టీడీపీ, బీజేపీ, జనసేన అమలాపురంలో నిర్వహించిన సభా విఫలం అయిందని, తాము జరిపిన సిద్ధం సభలో కొద్ది బాగం జనం కూడా సభకు రాలేదన్నారు. నరేంద్ర మోడీ కూడా సరిపోని వల్ల ఇంటికి వచ్చినట్లే సభకు వచ్చారని, నరేంద్ర మోడీ కూడా జగన్ ఓడిపోవాలని ఎక్కడా మాట్లాడలేదని గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడు కేవలం అబద్దాలనే నమ్ముకున్నారని విమర్శించారు. మోడీని గతంలో దూషించిన చంద్రబాబు దూషించారని, కానీ ప్రస్తుతం ఆయనకు మోదీ ప్రజాస్వామ్య వాది అయ్యారని వివరించారు. వారి పొత్తు అపనమ్మకం పైనే ఏర్పడిందని, ఆ పొత్తు ప్రజల కోసం కాదని, కేవలం వారి అవసరాల కోసమే అని దుయ్యబట్టారు. ఆ మూడు పార్టీలకు ఒకరి మీద మరొకరికే నమ్మకం లేదన్నారు. దేశవ్యాప్తంగా నిష్పక్షపాతంగా సంక్షేమ పాలన, అభివృద్ధి అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాత్రమే అని స్పష్టం చేశారు. ప్రజలు మరొకసారి గమనించి మంచి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# కమలాపురం నియోజకవర్గంలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసుల కవాతు



కమలాపురం నియోజకవర్గం లోని క్రిటికల్ గ్రామాలయిన ఉప్పరపల్లి, కొక్కిరాయి పల్లి లోని రహదారుల గుండా సశస్త్ర సీమా బల్ (ఎస్.ఎస్.బి) కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పోలీసులు సంకల్పించారు. ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన

కమలాపురం మన జనప్రగతి మార్చి 18:- జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు చెన్నూరు సి.ఐ పార్థసారధి ఆధ్వర్యంలో సోమవారం ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతవరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని ప్రజల్లో భరోసా కల్పించారు

# సాధారణ తనిఖీలు.. వాహనం వదిలి పారిపోయిన వ్యక్తులు



విజయవాడ మన జనప్రగతి మార్చి 18:- కోనసీమ జిల్లాలో అక్రమ గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు రావులపాలెం పోలీసులు. వాహనాలు తనిఖీల్లో భాగంగా రావులపాడు జాతీయ రహదారిపై ట్రైనీ డీఎస్పీ విష్ణు స్వరూప్ అటుగా వెళ్తున్న వాహనాలను తనిఖీ చేస్తుండగా.. ఇద్దరు యువకులు వారి వాహనాన్ని అక్కడే విడిచిపెట్టి పరుగులు తీయడాన్ని గమనించారు. అనుమానమొచ్చి వారిని వెంబడించారు పోలీస్ సిబ్బంది. సినీ ఫక్కీలో పక్కనే ఉన్న వరి చేనుల్లోకి పరిగెత్తిన ఆ ఇద్దరు నిందితులను చివరికి చాకచక్యంగా పట్టుకున్నారు ఖాకీలు. సుమారు రూ. 10 లక్షల విలువైన 2 వందల కేజీలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 11 బస్తాల్లో నింపిన గంజాయిని కారులో రోడ్డు మార్గాన మారేడుమిల్లి నుంచి తిరుపతికి తరలిస్తున్నట్టు విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారంలో ముగ్గురు వ్యక్తులు భాగంగా కాగా.. అందులో ఇద్దరు యువకులను పోలీసులు పట్టుకున్నారు. మరొక నిందితుడు పరారయ్యాడు. అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు రావులపాలెం పోలీసులు.

# లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

## ప్రముఖ వైద్యులు డా. బయారెడ్డి



అన్నమయ్య జిల్లా మన జనప్రగతి బ్యూరో మార్చి 18:- లయన్స్ క్లబ్ అఫ్ రాయచోటి టౌన్ వారి అధ్యరంలో వాసవి ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ వారి దాతృత్వంతో పట్టణంలోని చెక్ పోస్ట్ దగ్గర ఉన్న శ్రీ సాయినాథ్ మెన్స్ వేర్ దగ్గర నరేంద్ర కుమార్ శెట్టి ఆర్థిక సౌజన్యంతో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని మాజీ అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్ తెలిపారు.అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్. బయారెడ్డి మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభం అయినందువలన లయన్స్ క్లబ్ వారు చలివేంద్రం ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమైన విషయం అలాగే ప్రతి ఒక్కరూ ఎండలు తీవ్రత ఎక్కువ ఉండడం వలన రోజుకు 5 నుంచి 6 లీటర్ల నీరు త్రాగడం వలన ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరం అన్నారు. అలాగే ప్రజలందరూ వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం దాత నరేంద్ర కుమార్ శెట్టి మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజల సౌకర్యార్థం కొరకు చలివేంద్రం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని ఆయన తెలిపారు భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేదానికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ అధ్యక్షులు లయన్ నాగార్జున ఆచారి, కోశాధికారి లయన్ హరీష్ చంద్ర, క్లబ్ సభ్యులు లయన్ చాన్ బాషా,, లయన్ వెంకటరామిరెడ్డి,లయన్ శివ రెడ్డి, లయన్ వెంకట చలపతి,భాను, అనిల్ సెట్టీ, నందిని ట్రావెల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్ సమక్షంలో వైసీపీలోకి చేరికలు



విజయవాడ మన జనప్రగతి మార్చి 18:- ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో టీడీపీ పార్టీ నుంచి వైసీపీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే చాలా మంది నాయకులు ఫ్యాన్ పార్టీలోకి భారీగా వస్తున్నారు. తాజాగా, తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి విశాఖపట్నంకు చెందిన డాక్టర్ కంచర్ల అచ్యుతరావు చేరారు. ఆయనకు కండువా కప్పిలోకి పార్టీలోకి సీఎం ఆహ్వానించారు. కాగా, ఆయన గతంలో ప్రజారాజ్యం పార్టీలో క్రియాశీలకంగా పని చేశారు. అయితే, ప్రస్తుతం సేవా కార్యక్రమాలను అచ్యుతరావు నిర్వహిస్తున్నారు. ఇక, ఆరిలోవ ప్రాంతంలో స్థానికంగా మంచి పట్టున్న నేతగా అచ్యుతరావుకు గుర్తింపు ఉంది. సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి విశాఖపట్నంకు చెందిన టీడీపీ సీనియర్ నేత గంపల వెంకట రామచంద్ర రావుతో పాటు ఆయన సతీమణి సంధ్యా రాణి కూడా జాయిన్ అయ్యారు. వీరికి సీఎం జగన్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఇక, విశాఖపట్నం టీడీపీ సౌత్, ఈస్ట్ ఎలక్షన్ ఇంచార్జ్‌గా కూడా రామచంద్ర రావు పని చేసిన అనుభవం ఉంది.

# ఎటువంటి సమాచారం లేకుండా 18 మంది, దళితుల ఇంటి స్థలాల పట్టాలు రద్దు పరచిన వి.ఆర్.ఓ, రామన్న



బొమ్మనహాల్ మండలం మన జనప్రగతి మార్చి 18 :- బొమ్మనహాల్ మండల పరిధిలోని గోవిందవాడ గ్రామంలో గత మూడు సంవత్సరాల క్రితం,166-2 సర్వే నంబర్ లో గల జగనన్న ఇంటి పట్టాలు కార్యక్రమంలో భాగంగా హరిజనవాడ కు సంబంధించిన 18 మంది లబ్ధిదారులకు,ఇంటి పట్టాలు అప్పుడు మంజూరు చేయడం జరిగింది,ప్రస్తుతం హరిజన కాలనీ వాసులకు ఇబ్బందికరంగా ఉంటుంది,అనే ఉద్దేశంతో,పట్టాలు ఇచ్చిన రోజునే ఈ పట్టాలు మాకు వద్దు,అని 18 మంది లబ్ధిదారులు కలసి, తహశీల్దార్ వారి ఆఫీస్ కి వెనక్కి,సబ్మిట్ చేయడం జరిగింది, ఆ రోజు నుంచి,ఈరోజు వరకు కూడా అధికారులను అర్జీ రూపంలో గానీ, అడుగుతూనే ఉన్నాము, ప్రస్తుతం మొన్నటి వరకు ఎలిజిబుల్ లిస్టు లో ఉన్న 18 మంది ఇంటి పట్టాల లబ్ధిదారులకు, ఎటువంటి, సమాచారం. అందించకుండా వారి ద్వారా ఎటువంటి రాతపూర్వకమైన అర్జీని స్వీకరించకుండా, గోవిందవాడ గ్రామ వి.ఆర్.ఓ, రామన్న వారు ఉద్దేశపూర్వకంగా,ఆ యొక్క ఇంటి పట్టాలను''ఇన్ ఎలిజిబుల్" కింద "రిజెక్ట్"చేసారు, పలుమార్లు ఈ యొక్క,విషయాన్ని మండల అధికారులకు అర్జీ రూపంలో విన్నవించిన,కూడాను చూసి చూడనట్టుగా,తెలిసి, తెలియనట్టుగా,ఆర్జీపైన ఇన్నలేసి పక్కకు పెట్టేస్తున్నారు,తప్పు,అది ఎక్కడ ఉంది,ఏమి అయింది,అని అడిగిన దాఖలాలు లేవు,ఇప్పుడు అడుగుతుంటే,ప్రస్తుతం ఇప్పుడున్న ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నది,మేము ఏమి చేయలేకపోతున్నామని,ఇంటి లబ్ధిదారులకు,ఆధికారులు చెప్పుకుంటూన్నరు,ఈ విషయమై మండల అధికారులు,సంబంధిత అధికారులతో,చర్చించి 18మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు "ఎలిజిబుల్,'' రూపంలో నమోదు చేయంచి, అనుకూలమైన ఇంటి స్థలాలు, చూపించవలసిందిగా లబ్ధిదారులు కోరుతున్నారు,

# కూటమి విజయం తథ్యం

## పార్లమెంట్ టీడీపీ డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు డా పత్తి హిమబిందు



అనంతపురం బ్యూరో మన జనప్రగతి మర్చి 18:- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయాన్ని ఆపే శక్తి మరెవరికి లేదని కూటమి నిర్వహించిన ప్రజాగళం సభతో తేలిపోయిందని అనంతపురం పార్లమెంట్ టీడీపీ డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు స్పష్టం చేశారు. ఆదివారం ఎన్డీఏ కూటమి గుంటూరు లో నిర్వహించిన ప్రజాగళం ఘనవిజయానికి కృషిచేసిన నాయకులకు, కార్యకర్తలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పత్తి హిమబిందు మాట్లాడుతూ... గత ఐదు సంవత్సరాల వైకాపా ప్రభుత్వంలో ఒక్కటి అంటే ఒక్కటి చెప్పుకోదగ్గ పరిశ్రమ రావడం కరువైందన్నారు. పూట పూటకు అప్పులు తెచ్చి సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించడం, భవిష్యత్తు తరాలపై తలలపై అప్పులు మోపడమేనన్నారు. చదువుకున్న నిరుద్యోగులు రాష్ట్రం వదిలిపోతున్నారని దుయ్యబట్టారు. ఉపాధి లేక పల్లెప్రజలు వలసలు బాట పట్టాయని విమర్శించారు. మరోవైపు పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు, పక్క రాష్ట్రాల కంటే ఎక్కువగా డీజిల్ పెట్రోల్ ధరలు, ఎన్నో దఫాలుగా పెరిగిన కరెంటు బిల్లులతో పల్లె బతుకులు అతలాకుతలం అయ్యాయని విసుగెత్తిన అన్ని వర్గాల ప్రజలు, వైకాపా ప్రభుత్వాన్ని సాగనంపాలని నిర్ణయించుకున్న మాట మరి కొద్ది రోజుల్లో తేటతెల్లమవు తుందన్నారు. ఆదివారం నిర్వహించిన ప్రజాగళం సభతో ప్రజాతీర్పు వెలవరించారని ఆమె స్పష్టం చేశారు.

# పూడికతీతతో పెరిగిన చెరువుల సామర్థ్యం

## 50వారాల సెల్ఫీ ఛాలెంజ్ లో మాజి మంత్రి కాలువ



బొమ్మనహాల్ మన జనప్రగతి మార్చి 18:- శతాబ్దాల చరిత్ర కలిగిన కనేకల్లు చిక్కణ్ణేశ్వర చెరువులో పూడికతీత పనులను తన హయాంలో చేపట్టామని, రాయదుర్గం టిడిపి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. తన 50వారాల సెల్ఫీ ఛాలెంజిలో భాగంగా కనేకల్లు చెరువుపై సోమవారం ఆయన 49వ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు, వందల ఏళ్ల కిందట నిర్మించిన చెరువులో పూడిక పేరుకుపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందన్నారు, తద్వారా ఆ చెరువు ఆయకట్టు అవసరాలు తీరక రైతులు ఇబ్బందులకు గురయ్యేవారన్నారు,టీడీపీ హయాంలో చెరువులో పూడిక తీత పనుల కోసం రూ.2 కోట్లు మంజూరు చేశామన్నారు.చాలా వరకు పనులను చేశామన్నారు, కనేకల్లు ప్రాంత రైతుల విజ్ఞప్తి మేరకు రెండో పంటకు సాగునీరు అందించడం కోసమే పూడిక తీతపై ప్రత్యేక చొరవ తీసుకున్నామన్నారు. మన రైతుల కోసం వేదవతి నది గర్భంలో సబ్ సర్ఫేస్ డ్యాములను కూడా నిర్మించామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అనేక చెక్ డ్యాంలతో పాటు పంట కుంటలను నిర్మించామని తెలిపారు,రైతు మేలు కొరకు చంద్రబాబు ఆశీస్సులతో ఆనాడు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు,ఐదేళ్ల వైసిపి ప్రభుత్వం రైతు బాగు కోసం ఒక్కటైన మంచి చేసిందా అని ప్రశ్నించారు,రైతు సంక్షేమ పథకాలన్ని రద్దు చేసిన జగన్మోహన్ రెడ్డి రైతు ద్రోహిగా చరిత్రలో శాశ్వత స్థానాన్ని దక్కి%శీ%చుకున్నాడని ఆయన దుయ్యబట్టారు,రైతు ఓట్లతో రాజ్యమేలుతున్న జగన్ రెడ్డి రైతులను నిలువునా ముంచుతున్నాడన్నారు, రెండు నెలల్లో జరిగే సాదారణ ఎన్నికల్లో వైసిపిని గద్దె దించే అవకాశం ప్రజలకు వచ్చిందన్నారు, ప్రజలందరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు,

# తెలంగాణ ప్రజలను వదిలి వెళ్తునందుకు బాధగా ఉంది..

## ఎప్పటికీ మరువను మాజీ గవర్నర్ తమిళిసై



హైదరాబాద్ మన జనప్రగతి మార్చ్ 18:- ఉదయం తెలంగాణ గవర్నర్ గా తమిళిసై సౌందర్ రాజన్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.. రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి పంపారు. తెలంగాణ, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా తమిళిసై కొనసాగిన విషయం తెలిసిందే.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమిళిసై సౌందరరాజన్ తమిళనాడు నుంచి పోటీ చేస్తారని తెలుస్తోంది. ఈ క్రమంలో.. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి చెన్నైకు బయల్దేరారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్?లో మాజీ గవర్నర్ తమిళిసై మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ ప్రజలను వదిలేసి వెళ్తునందుకు బాధగా ఉంది.. కానీ తప్పడం లేదన్నారు. తెలంగాణ ప్రజలందరు నా అన్నాదమ్ములు, అక్కాచెల్లెళ్ళు అని పేర్కొన్నారు. ఎప్పుడు తెలంగాణ ప్రజలను మరువను.. అందరితో కలుస్తూ ఉంటానని తెలిపారు. మరోవైపు.. తమిళనాడులో ఏ నియోజకవర్గం నుండి పోటీ చేస్తారనే మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆవెూ దాటవేస్తూ వెళ్ళిపోయారు. ఇదిలా ఉంటే.. చెన్నై సెంట్రల్ నుంచి బీజేపీ ఎంపీ టికెట్ ఇవ్వనున్నట్లు సమాచారం. కన్యాకుమారి.. తమిళిసై సొంత జిల్లా.. పైగా కన్యాకుమారి, తిరునల్వేలి, చెన్నై సెంట్రల్ స్థానాల్లో ఒక స్థానం నుంచి ఏదో ఒక స్థానంలో తమిళిసై పోటీ చేయనున్నట్లు సమాచారం తెలుస్తోంది. గతంలో తమిళనాడు నుంచి లోక్‌సభ ఎన్నికల్లో రెండుసార్లు ఓటమి పాలయ్యారు. 2009లో తొలిసారి చెన్నై నార్త్ నుంచి పోటీ చేసిన ఆయన.. 2019లో తూత్తుకుడి నుంచి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేశారు. ఆ తర్వాత మూడుసార్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగినా ప్రజలు ఆదరించలేదు. అయితే, ఆమె పార్టీకి చేసిన సేవలను గుర్తించిన బీజేపీ నాయకత్వం ఆమెను తమిళనాడు గవర్నర్‌గా నియమించింది.

# సజావుగా మొదటి రోజు పదవ తరగతి తెలుగు పరీక్ష

## మొదటిరోజు పరీక్షకు 97మంది విద్యార్థులు గైహాజరు



బొమ్మనహాల్ మన జనప్రగతి మార్చి 18 :- బొమ్మనహాల్ మండల కేంద్రంలోని నాలుగు పరీక్ష కేంద్రాలలో జరుగుతున్నటువంటి పదవ తరగతి పరీక్షలు సోమవారం మొత్తం 1053 మంది విద్యార్థులకు గాను 956 విద్యార్థులు హాజరై పరీక్షలు రాయగా,మిగిలిన 97 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలకు గైహాజరు కావడం జరిగినదని,మండల విద్యాధికారి వి.మల్లికార్జున-2,వీరన్న-1,వారు తెలియజేశారు,పరీక్ష కేంద్రానికి విద్యార్థిని,విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవడం కనిపించింది,విద్యార్థిని విద్యార్థులకు,ఎటువంటి ఇబ్బంది లేకుండా,ప్రశాంతంగా మొదటి రోజు పరీక్ష పూర్తి కావడం జరిగిందని, మండల విద్యాధికారులు, వి. మల్లికార్జున, ఎం.ఈ.ఓ,-2, వీరన్న ఎం.ఈ.ఓ,-1,వారు తెలియజేశారు,


# 48 గంటల్లో రాజకీయ పార్టీ నేతల ఫ్లెక్సీలు, స్టిక్కర్లను తొలగిస్తున్నాం..

తిరుపతి మన జనప్రగతి మార్చి 18:- తిరుపతి జిల్లాలో మొత్తం 2,136 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా తెలిపారు. ఇక, జిల్లా వ్యాప్తంగా 17, 94, 733 మంది ఓటర్లు ఉన్నారు.. అందులో పురుష ఓటర్లు - 8,74,738 మంది ఉండగా, స్త్రీలు - 9,19,817 మంది ఉన్నారు. ఇక, యువ ఓటర్లు - 36,162 మంది ఉన్నారని ఆయన చెప్పుకొచ్చారు. వీల్ చైర్ కే పరిమితమైన వారు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం ఉంది.. సి.విజల్ యాప్ ద్వారా ఎన్నికల్లో అక్రమాలను అడ్డుకుంటాం.. యువ ఓటర్లలో చైతన్యం రావాలి అని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండి ఓటు హక్కును పొందిన ప్రతి ఒక్కరు ఓటును వినియోగించుకోవాలి.. 48 గంటల్లో రాజకీయ పార్టీ నేతల ఫ్లెక్సీలు, స్టిక్కర్లను తొలగిస్తున్నామని కలెక్టర్ లక్ష్మీ షా అన్నారు. కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించామని తిరుపతి జిల్లా ఎస్పీ క్రిష్ణకాంత్ పటేల్ పేర్కొన్నారు. 4 వేల మంది పోలీసులు ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్నారు.. రౌడీ షీటర్లను ఇప్పటికే బైండోవర్ చేశాం.. రౌడీషీటర్ల వద్ద ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాం.. సమస్యాత్మక పోలింగ్ బూత్ లను గుర్తించాం..కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య ఎన్నికలు సజావుగా నిర్వహిస్తామన్నారు.



# త్వరలో ప్రజల్లోకి చంద్రబాబు

## ప్రజాగళం పేరుతో విస్తృత పర్యటనలు



విజయవాడ మన జనప్రగతి మార్చి 18:-టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు త్వరలో ప్రజల్లోకి వెళ్ళనున్నారు. ప్రజా గళం పేరుతో ప్రజల్లోకి విస్తృత పర్యటనలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన్న సభకు పెట్టిన పేరుతోనే ప్రజల్లోకి టీడీపీ అధినేత వెళ్లనున్నారు. ఎన్డీఏ కూటమిని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలంటే ప్రజా గళం పేరే సరైందని చంద్రబాబు భావించారు. ఒకట్రెండు రోజుల్లో ఎంపీ అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. అలాగే, పెండింగులో ఉన్న 16 అసెంబ్లీ స్థానాల పైనా ఆయన తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. ఇక, ఎంపీ అభ్యర్థులతో పాటు మిగిలిన అసెంబ్లీ అభ్యర్థుల పేర్ల ప్రకటన తర్వాత ప్రజల్లోకి చంద్రబాబు వెళ్లనున్నారు. చంద్రబాబు చేపట్టే ప్రజా గళం రోడ్ మ్యాప్ ను టీడీపీ సిద్ధం చేస్తోంది. ప్రజల గుండె చప్పుడు బలంగా వినిపించడానికే6 మూడు పార్టీలు జట్టు కట్టాయని చంద్రబాబు అన్నారు. రాబోయే ఎన్నికల్లో మీరు ఇచ్చే తీర్పు రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. మా జెండాలు వేరే కావొచ్చు.. మా అజెండా మాత్రం ఒక్కటే అని ఆయన చెప్పుకొచ్చారు. మోడీ ఒక వ్యక్తి కాదు.. భారతదేశాన్ని విశ్వగురుగా మారుస్తున్న ఒక శక్తి అని చెప్పారు. మోడీ అంటే దేశ ఆత్మ గౌరవం, ఆత్మ విశ్వాసం.. ప్రపంచం మెచ్చిన మేటి నాయకుడు అని టీడీపీ అధినేత తెలిపారు. ప్రధాన మంత్రి అన్నయోజన, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, జల్ జీవన్ మిషన్ లాంటి పథకాలతో సంక్షేమానికి మోడీ కొత్త నిర్వచనం ఇచ్చారు అంటూ చంద్రబాబు అన్నారు.

# సార్వత్రిక ఎన్నికల వేళ ఈసీ సంచలన నిర్ణయం

## 6 రాష్ట్రాల హెూం సెక్రటరీల తొలగింపు.. డీజీపీ కూడా!




న్యూ ఢిల్లీ మన జనప్రగతి మార్చి 18:- సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల విడుదల చేసింది. ఈ క్రమంలోనే దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా రాష్ట్రాల హెూం శాఖ కార్యదర్శులను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలోనే బెంగాల్ పోలీస్ బాస్‌ను పక్కన పెడుతూ సంచలన ఉత్తర్వులు వెలువరించింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా రాష్ట్రాల హెూం శాఖ కార్యదర్శులను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గుజరాత్, ఉత్తరప్రదేశ్, బీహార్, జార?ండ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ హెూం శాఖ కార్యదర్శులను ఎన్నికల సంఘం తొలగిస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. అలాగే మిజోరం, హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వాల్లోని సీనియర్ అధికారులపై కూడా వేటు పడింది. మరోవైపు.. పశ్చిమ బెంగాల్ డీజీపీ రాజీవ్ కుమార్‌ను కూడా విధుల నుంచి ఎన్నికల సంఘం తొలగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ఈసీ తొలిసారి చర్యలు తీసుకుంది. బృహన్ ముంబై కార్పొరేషన్ అధికారుల పైనా కూడా ఈసీ వేటు వేసింది. బీఎంసీ కమిషనర్, అదనపు, డిప్యూటీ కమిషనర్లను ఈసీ తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# పెద్ద పదవులు అనుభవించి.. పార్టీకి సిద్ధాంతం లేదని మాట్లాడుతారా..



హైదరాబాద్ మన జనప్రగతి మార్చి 18:- జితేందర్ రెడ్డి పార్టీ మార్పుపై బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీలో పెద్ద పెద్ద పదవులు అనుభవించి... పార్టీకి సిద్ధాంతం లేదని మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కొడుక్కి సీటు ఇస్తే సిద్ధాంతం ఉన్న పార్టీ.. నీకు సీటు ఇవ్వక పోతే సిద్ధాంతం లేదా అని ప్రశ్నించారు. ఏ ఆర్థిక ప్రయోజనాలు కోసం మీరు పార్టీ మారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ బంధువులు కంపెనీ అమ్ముతున్న ఫ్లాట్స్ ఏమీ.. చేవెళ్ల పార్లమెంట్ ఎంపీతో కలిసి ఏమీ మాట్లాడారు.. ఈస్టర్న్ కన్స్ట్రక్షన్ ఎవరిది.. భూములను ఆక్రమించింది ఎంత.. సర్వే నంబర్ 343, 403 లో ఏమీ జరుగుతుందని ప్రశ్నించారు. అడ్డగోలు కన్స్ట్రక్షన్ మీద ఈడీ, ఐటీకి ఫిర్యాదు చేస్తానని రఘునందన్ రావు అన్నారు. తమ దగ్గర పూర్తి సమాచారం ఉంది.. మీరు ఎందుకు పార్టీ మారారో ఆధారాలు తమ దగ్గర ఉన్నాయన్నారు. మీరు బీజేపీకి కొత్తగా సిద్ధాంతాలు నేర్పించాల్సిన అవసరం లేదని మండిపడ్డారు. వ్యక్తిగత, ఆర్థిక లబ్ది కోసం మీరు పార్టీ మారారని పేర్కొన్నారు. పాలమూరులో మీరు మీ కొడుకు కోసం పని చేశారా.. ఇప్పుడు అధికారంలోకి ఉన్న పార్టీకి మద్దతు ఇవ్వలేదా అని ప్రశ్నించారు. కన్స్ట్రక్షన్ కంపెనీల నుండి డబ్బులు వందల కోట్లు చేతులు మారాయి.. కాంగ్రెస్ అభ్యర్థులకు ఆ డబ్బులు పంపబోతున్నారని రఘునందన్ రావు తెలిపారుఇదిలా ఉంటే.. శుక్రవారం జితేందర్ రెడ్డి బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరారు. బీజేపీ నుంచి మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్ ఆశించి నిరాశచెందిన ఆయన తన కుమారుడు మిథున్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపదాస్ మున్షీ సమక్షంలో ఆయన చేతులు కలిపారు. కాంగ్రెస్‌లో చేరిన వెంటనే జితేందర్‌రెడ్డికి కేబినెట్ హెూదాతో కూడిన రెండు పదవులు కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా, రాష్ట్ర ప్రభుత్వానికి క్రీడా వ్యవహారాల సలహాదారుగా నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

# విద్యుత్ షాక్‌తో వ్యవసాయ కూలి మృతి



బొమ్మనహాల్ మన జనప్రగతి మార్చి 18:- బొమ్మనహాల్ మండల పరిధిలో గోవిందవాడ గ్రామంలోని పులకుర్తి ఉపేంద్ర,వారు,గత కొన్ని రోజుల క్రితం పొలంలో పంట సాగునీటి అవసరాలు కోసం బోరును వేయంచుకున్నాడు,దానిని వాడుకకు నిమిత్తం,కరెంట్ వైర్ ను, తగిలించి ఆన్ చేయడానికి ప్రయత్నిస్తుండగా ఒక్కసారి విద్యుత్ షాక్ కింద పడడంతో అక్కడున్నవారు వేంటనే,బళ్లారి హాస్పిటల్ తీసుకోని పోయారు,అక్కడే ఉన్న బళ్లారి విమ్స్కు తరలించగా అప్పటికే ఉపేంద్ర (25) మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు, భార్య పిల్లలు ఉన్నారు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# హిమాచల్ ప్రదేశ్ రెబల్ ఎమ్మెల్యేలకు షాక్..

## స్టేకు నిరాకరణ



న్యూ ఢిల్లీ మన జనప్రగతి మార్చి 18:- హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ విధించిన అనర్హత వేటుపై స్టే విధించేందుకు న్యాయస్థానం నిరాకరించింది. అనర్హత వేటుపై దాఖలైన పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం అసెంబ్లీ స్పీకర్‌కు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా స్పందన తెలియజేయాలని కోరింది. ఆరుగురు ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ కోర్టు పరిధిలో ఉన్నందున అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు, ఓటు హక్కును వినియోగించుకునేందుకు వారిని అనుమతించకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే ఆరు స్థానాల్లో ఉప ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. స్పీకర్ కుల్దీప్ సింగ్ విధించిన అనర్హత వేటుపై స్టే విధించాలని రెబల్ ఎమ్మెల్యేలు కోరారు. అందుకు కోర్టు నిరాకరించింది. స్టే విధించే అంశాన్ని పరిశీలించాల్సి ఉందని.. దీనిపై 4 వారాల్లో సమాధానం ఇవ్వాలని స్పీకర్‌కు కోర్టు తెలిపింది. తదుపరి విచారణను మే 6కు వాయిదా వేసింది. సార్వత్రిక ఎన్నికల కోసం గత శనివారం ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. హిమాచల్ ప్రదేశ్‌లో అనర్హత వేటు పడిన ఆరు స్థానాల్లో కూడా ఉప ఎన్నిక చేపట్టేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకు మే 7 నుంచి నామినేషన్ల స్వీకరణ ఉంటుందని ప్రకటించింది. అయితే గత ఫిబ్రవరి నెలలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ విప్ ధిక్కరించి ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారు. వీరిపై ఫిబ్రవరి 29న స్పీకర్ అనర్హత వేటు విధించారు. దీనిపై వారంతా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మరోవైపు ఎమ్మెల్యేలపై వేటుతో అసెంబ్లీలో కాంగ్రెస్ సంఖ్యా బలం 40 నుంచి 34కి పడిపోయింది. ఆరుగురు తిరుగుబాటు ఎమ్మెల్యేలు వీరే: సుధీర్ శర్మ (ధర్మశాల), రవి ఠాకూర్ (లాహౌల్-స్పితి), రాజిందర్ రాణా (సుజన్‌పూర్), ఇందర్ దత్ లఖన్‌పాల్ (బార్సర్), చైతన్య శర్మ (గాగ్రేట్) మరియు దేవిందర్ కుమార్ (కుట్లేహర్) హిమాచల్‌ప్రదేశ్‌లో మొత్తం 68 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఆరుగురు ఎమ్మెల్యేలపై వేటు పడడంతో ఆ సంఖ్య 62కి పడిపోయింది. ఇదిలా ఉంటే 25 మంది ఎమ్మెల్యేలు ఉన్న బీజేపీ మాత్రం రాజ్యసభ సీటును దక్కించుకుంది. స్వతంత్ర ఎమ్మెల్యేలు కూడా బీజేపీకే మద్దతుగా నిలిచారు.

# ఏపీ సీఈఓతో ఎన్డీఏ కూటమి నేతల భేటీ

## డీజీపీ సహా పోలీస్ ఉన్నతాధికారులపై ఫిర్యాదు




విజయవాడ మన జనప్రగతి మార్చి 18:- ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల ఆఫీసర్ ఎంకే మీనాతో ఎన్డీఏ కూటమి నేతలు సమావేశం అయ్యారు. ఏపీ సీఈఓను వర్ల రామయ్య, బండ్రెడ్డి రామకృష్ణ, పాతూరి నాగభూషణం నేతృత్వంలోని ఎన్డీఏ బృందం కలిసింది. ఈ మీటింగ్ లో ప్రధాని పాల్గొన్న ప్రజా గళం సభలో భద్రతా వైఫల్యంపై సీఈఓకు ఎన్డీఏ ఫిర్యాదు చేసింది. డీజీపీ సహా పోలీస్ ఉన్నతాధికారులపై ఎన్డీఏ కంప్లైంట్ చేసినట్లు పేర్కొన్నారు. డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్సార్, గుంటూరు రేంజ్ డీఐజీ పాలరాజు, పల్నాడు ఎస్పీ రవి శంకర్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ వచ్చినా కొందరు పోలీసులు బరితెగించి వ్యవహరిస్తున్నారు.. ప్రధాని పాల్గొన్న ప్రజాగళం సభను చిన్నాభిన్నం చేసేందుకు ప్రయత్నించారు.. ప్రధాని సభ అనుకున్నారా..? దారిన పోయే దానయ్య సభ అనుకున్నారా?.. ప్రధాని వస్తున్నారన్నా.. కనీస భద్రత కూడా ఏర్పాటు చేయలేదు.. గుంటూరు రేంజ్ డీఐజీ పాలరాజు కంటే కానిస్టేబుల్ నయం.. ఎన్నికల విధుల నుంచి డీజీ, ఇంటెలిజెన్స్ చీఫ్, గుంటూరు రేంజ్ ఐజీ, పల్నాడు ఎస్పీలను విధుల నుంచి తొలగించాలి అని ఆయన డిమాండ్ చేశారు. డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్సార్, గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, పల్నాడు ఎస్పీ రవి శంకర్ రెడ్డిలు వైసీపీకి అనుకూలంగా దొంగ ఓట్లు వేయిస్తారు అంటూ ఆరోపించారు. బీజేపీ ప్రతినిధి పాతూరి నాగభూషణం మాట్లాడుతూ.. ప్రధాని రిసీవింగ్ దగ్గర నుంచి పాసుల వరకు పోలీసులు ఇబ్బంది పెట్టారన్నారు. ప్రధానికి పికలను ఇవ్వడానికి కూడా అనుమతివ్వలేదు.. పల్నాడు ఎస్పీ మా ఫోన్లు కూడా లిఫ్ట్ చేయలేదన్నారు. అలాగే, జనసేన ప్రతినిధి బండ్రెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రధాని సభలో ప్రొటోకాల్ విఫలమయ్యారు.. ఎన్నికల విధులు శాంతియుతంగా జరగాలంటే భద్రతా లోపాలకు కారణమైన ఉన్నతాధికారులను తప్పించాలి.. ప్రధాని సభకు భద్రతను దగ్గరుండి చూసుకోవాల్సిన పల్నాడు ఎస్పీ రాకపోవడమేంటీ..? అని ఆయన ప్రశ్నించారు

# ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ పై ఈడీ అధికారిక ప్రకటన..




న్యూ ఢిల్లీ మన జనప్రగతి మార్చి 18:- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ పై ఈడీ సోమవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 15వ తేదీన కవితను అరెస్ట్ చేశామని.. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో కవితను అరెస్ట్ చేసినట్లు పేర్కొంది. ఢిల్లీ ప్రత్యేక కోర్టు కవితను ఏడు రోజుల కస్టడీకి అనుమతించిందని తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు కవిత ఈడీ కస్టడీలో ఉంటుందని పేర్కొంది. కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నామని తెలిపింది. రూ. 128 కోట్ల ఆస్తులను గుర్తించి జప్తు చేశాం.. మనీష్‌సిసోడియా, సంజయ్‌సింగ్, విజయ్‌నాయర్‌లతో కవితకు లింక్‌లు ఉన్నట్లు ఈడీ గుర్తించింది. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావు సోమవారం సాయంత్రం ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ములాఖత్‌లో భాగంగా వీరిద్దరు కవితను కలవనున్నారు. కాగా.. కవితను ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు కలిసేందుకు కోర్టు అనుమతించింది. వందకోట్ల ముడుపుల వ్యవహారంలో కవిత ప్రమేయం ఉంది.. ఆప్ నేతలకు వంద కోట్లు చెల్లింపులో కవితది కీలకపాత్ర అని ఈడీ పేర్కొంది. ఇప్పటివరకు 240 చోట్ల సోదాలు చేశాం.. ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై, ముంబైలో సోదాలు చేపట్టినట్లు ఈడీ తెలిపింది. ఢిల్లీ లిక్కర్స్ కేసులో ఇప్పటి వరకు 15 మంది అరెస్ట్ చేసినట్లు ఈడీ పేర్కొంది. 5 సప్లిమెం టరీ ఛార్జ్‌షీట్లు దాఖలు చేశామని తెలిపింది. అంతేకాకుండా..

# పకడ్బందీగా పదవ తరగతి పరీక్షలు




చెన్నూరు మన జనప్రగతి మార్చి 18:- మండలంలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలు సోమవారం అధికారులు పకడ్బందీగా నిర్వహించారు, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఆర్ ఆర్ పాఠశాల లోని రెండు కేంద్రాలలో మొత్తం 351 మంది విద్యార్థులకుగాను 344 మంది విద్యార్థుల హాజరై పరీక్షలు రాయడం జరిగింది, కాగా ఏడు మంది విద్యార్థులు వివిధ కారణాలవల్ల పరీక్షకు హాజరు కాలేదు, ఆర్ ఆర్ పాఠశాలలో 168 మంది విద్యార్థులకు గాను 167 మంది విద్యార్థులు హాజరుకాగా, ఒకరు గైర్హాజరయ్యారు, అదేవిధంగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో 183 మంది విద్యార్థులకు గాను 177 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు, 6 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి తెలియజేశారు

# తలారి రంగనాయకులు, రాజాను పరామర్శించిన బొంబాయి రమేష్ నాయుడు, కాసా



యాడికి మన జనప్రగతి, మార్చి 18: - యాడికి గ్రామనికి చెందిన తలారి రంగనాయకులు, రాజలధు సోమవారం మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్ లు పరామర్శించారు. గత వారం మహాశివ రాత్రి సందర్భంగా కోన రామలింగేశ్వర స్వామి సన్నిధి వెళుండగా మార్గ మధ్యంలో కోన ఉప్పలపాడు గ్రామ సమీపన రెండు బైకులు ఢీ కొనడంతో తీవ్ర గాయలు అయ్యాయి. అనంతపురం పావని హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న రంగనాయకులు, రాజ ను యాడికి మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్ పరామర్శించారు. ఈయనతో పాటు ఎస్సీ సెల్ కన్వీనర్ పందు శ్రీరాములు, పెద్దారాజు, దూద్ వలి తదితరులు పాల్గొన్నారు.

# హైవేపై ఫ్లైట్స్ ఎమర్జెన్సీ ల్యాండింగ్..



విజయవాడ మన జనప్రగతి మార్చి 18:- ఎయిర్‌ఫోర్స్ అధికారులు ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జాతీయ రహదారులపై విమానాల ఎమర్జెన్సీ ల్యాండింగ్ ప్రక్రియను చేపట్టారు. సోమవారం చేపట్టిన ఈ క్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఇందుకు బాపట్ల జిల్లా వేదికైంది. విమానాలను ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేయించాలంటే ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లాల్సిందే.. కానీ అత్యవసర పరిస్థితుల్లో జాతీయ రహదారులపై దించేందుకు ఎయిర్‌ఫోర్స్ అధికారులు ఈ ప్రయోగానికి సిద్ధమయ్యారు. దీనికి సంబంధించిన ట్రయల్ రన్‌ను ఏపీలో నిర్వహించారు. బాపట్ల జిల్లా కొరిశపాడు-రేణింగవరం జాతీయ రహదారిపై విమానాల ల్యాండింగ్ కార్యక్రమాన్ని ఎయిర్ ఫోర్స్, హైవే అధికారులు చేపట్టారు. సోమవారం నిర్వహించిన ట్రయల్ రన్‌లో పలు విమానాలు ల్యాండింగ్ అయ్యాయి. నేషనల్ హైవేపై ట్రాన్స్‌పోర్టు విమానాలు, ఏఎన్ 32, డెన్వర్ కార్గో, సుఖోయ్ ఫైటర్ జెట్, యుద్ధ విమానాలు అత్యవసర ల్యాండింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశాయి. ఇదిలా ఉంటే జాతీయ రహదారిపై నిర్వహించిన విమానాల ట్రయల్ రన్ కార్యక్రమానికి సమీప గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి తిలకించారు. ఈ సందర్భంగా విమానాల ల్యాండింగ్‌ను వీక్షకులు తమ ఫోన్లలో బంధించారు. మరోవైపు ట్రయల్ రన్ కారణంగా జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. హైవేలపై విమానాల ల్యాండింగ్ కోసం.. హైవే అథారిటీ 79 కోట్ల రూపాయలతో 4.1 కిలోమీటర్ల పొడవైన రహదారిని ప్రత్యేకంగా నిర్మించింది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో జాతీయ రహదారులపైనే విమానాలు ఎమర్జెన్సీ ల్యాండ్ చేసే విధంగా ఇవి ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య హైవేపై విమానాల ట్రయల్ రన్ నిర్వహించారు.

# ప్రజలకు వడదెబ్బపై అవగాహనా ర్యాలీ

## హెల్త్ ఆఫీసర్ హరినాథ్



బొమ్మనహాల్ మన జనప్రగతి మార్చి 18:- బొమ్మనహాల్ మండల పరిధిలో. దర్గా హొన్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని, గోవిందవాడ సబ్ సెంటర్, డాక్టర్ రఫియా సుల్తానా వారి ఆదేశాల మేరకు, హెల్త్ ఆఫీసర్ హరినాథ్ వారి ఆధ్వర్యంలో గ్రామం నందు ప్రజలకు వడదెబ్బ పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ హరినాథ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఈసంవత్సరం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నదని ప్రజలు ఎండకు తిరగరాదు. అని దాని వలన వడదెబ్బ తగులుతుంది. అని కళ్ళు తిరగడం. వాంతులు రావడం. అలసట. నీరు ఎక్కువగా దప్పిక కావటం. నీరసం. మొదలయిన. డీ హైడ్రేషన్ లక్షణాలు కనపడతాయి. అని వెంటనే కొబ్బరి నీళ్లు. మజ్జిగ. గంజి. ఓ. ఆర్. ఎస్. ద్రావణం తాగడం ద్వారా వడదెబ్బ నుండి మన ప్రాణాలను కాపాడుకోవచ్చు అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. పీ. హెచ్. ఈ. ఓ, లక్ష్మి నాయక్, సూపర్వైజర్ భారతి, పీ. హెచ్. ఎన్, సుశీల, ఏ. యన్. యం. మల్లమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, జైరాజ్, మస్తాన్, ఆశ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గుంతకల్లులో టిడిపి కార్యాలయం ప్రారంభం






అనంతపురం బ్యూరో మన జనప్రగతి మర్చి 18:- అనంతపురం పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గ కేంద్రమైన గుంతకల్లు పట్టణంలోని కసాపురం రోడ్డులో మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశాలు మేరకు తెలుగు దేశం పార్టీ కార్యాలయంను ఆయన సోదరులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణస్వామి, గుమ్మనూరు నారాయణ మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని అవసరం ఎంతైనా ఉందన్నారు. అప్పుడే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. యువతకు ఉపాధి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని వెల్లడించారు. అలాగే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. ప్రధానంగా జగన్ రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి వేయించి అఖండ మెజారిటీతో టిడిపిని గెలిపించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో పట్టణ సమస్యలపై గుమ్మనూరు జయరాం సోదరులు చర్చించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సజావుగా 10వ తరగతి పరీక్షలను నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి



అనంతపురం బ్యూరో మన జనప్రగతి మార్చి18:- జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. సోమవారం అనంతపురం నగరంలోని మొదటి రోడ్ లో ఉన్న శ్రీ శారదా నగరపాలక బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్, తదితరులు పాల్గొన్నారు.

# అగాపే ఆశ్రమానికి మంచాలు పంపిణీ



యాడికి మన జనప్రగతి మార్చి 18 :- మండలంలోని కమలపాడు రోడ్డులో ఉన్న అగాపే ఆశ్రమానికి సోమవారం మంచాలను పంపిణీ చేశారు. అనంతపురంలో నివాసముంటున్న (జిల్లా పరిషత్ సూపర్డెంట్ రిటైర్డ్) ఈటె ఇజ్రాయిల్ ఆయన భార్య సుశీలమ్మ, కుమారుడు దినేష్, కోడలు రాణి లు ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు మంచాలు లేవని గుర్తించి దాతృత్వంతో ముందుకు వచ్చి దాదాపు రూ. 22,000 ఖర్చు పెట్టి 6 ఇనుప మంచాలు ఆశ్రమానికి అందచేశారు. ఇంకెన్నో ఇలాంటివి చేపడతామన్నారు. ఆశ్రమ ఫౌండర్ బత్తులప్రసాద్ , ఆశ్రమంలోని వారు వారికి వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

# తాను టిడిపి, వైసిపి అభ్యర్థులతో పోటీగా నిలుస్తా

## వై. మధు సూధన్ రెడ్డి



ఉరవకొండ మన జనప్రగతి మార్చి 18:-ఉరవకొండ నియోజకవర్గం ప్రజలు అభిమానించే మనిషి వై. మధుసూదన్ రెడ్డి. ప్రజాసేవ కోసం పని చేస్తాతాను పోటీ చేస్తే తెలుగుదేశం అభ్యర్థి పయ్యావుల కేశవ్, వైఎస్ఆర్సిపి వై. విశ్వేశ్వర్ రెడ్డి అభ్యర్థులకు ధీటుగా నిలుస్తానని మధు సూధన్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నియామకం అధిష్టాన నిర్ణయం మేరకే ఉంటుందన్నారు. ఉరవకొండ కాంగ్రెస్ సీటు ఎవరికి ఎవరికీ శీర్షిక న మన జన ప్రగతిలో వచ్చిన కథనంపై మధుసూదన రెడ్డి స్పందించారు. వై. మధుసూదన్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె వై. షర్మిల రెడ్డి కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర అధ్యక్షురాలుగా నియామకం పార్టీ పగ్గాలు అధిష్టించిన పిదప వై. షర్మిలారెడ్డి ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు చెప్పారు. ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీటు కేటాయిస్తే పయ్యావుల కేశవ్, విశ్వేశ్వర్ రెడ్డి లతో పోటీలో ఉంటానని తెలిపారు. ప్రజల మధ్య ఉంటూ నిత్యం ప్రజా సేవ కోసం పని చేస్తానంటూ ప్రజా సమస్యలను ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తానని నియోజకవర్గ ప్రజలకు తెలిపారు., కాంగ్రెస్ పార్టీ పొడుపాటి రామానాయుడు, బ్యాళ్ల ప్రసాద్, తమ కాంగ్రెస్ కుటుంబ సభ్యులతో తమకు ఎలాంటి విభేదాలు లేవని పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపిక విషయంలో అధిష్టాన నిర్ణయం తనకు శిరోధార్యం అన్నారు..

# చిక్కేపల్లిలో పలువురు నాయకులు వైసీపీలో చేరిక



యాడికి ,మన జనప్రగతి మార్చి 18 :- మండలంలోని చిక్కేపల్లి గ్రామంలో తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో సోమవారం పలువురు వైకాపా లోకి చేరినారు. చిక్కేపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి వారితోపాటు 30 మంది వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పేరం స్వర్ణలత, యాడికి మండలం వైసిపి సీనియర్ నాయకుడు బాల రమేష్ బాబు, యాడికి మాజీ జెడ్పిటిసి వెన్నపూస వెంకటరామిరెడ్డి, నగరూరు బ్రహ్మానంద రెడ్డి, ఉమ్మడి రామాంజనేయ రెడ్డి, జూటూరు భాస్కర్ రెడ్డి, కోడూరు సుబ్బారెడ్డి, పిన్నేపల్లి లక్ష్మిరెడ్డి, ప్రకాష్ రెడ్డి, రవిశంకర్ రెడ్డి, ఎర్ర కొండారెడ్డి , వెల్ల వెంకటేష్ , సందీప్ ,నాగేంద్ర ,మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ విజయరామరాజు



వేముల మన జనప్రగతి మార్చి 18:- రెండు నెలల కాల వ్యవధిలో జరుగునున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి భద్రత చర్యలు చేపట్టాలని కడప జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.సోమవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ వేముల మండల పరిధిలో రాచుకుంటపల్లి గ్రామంలో ఉన్నటువంటి స్థానిక పోలింగ్ కేంద్రాన్ని పాడ ఓ.ఎస్.డి అనిల్ కుమార్ రెడ్డి మరియు మండల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి భద్రత చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.ఎలక్షన్ సమయంలో ఎండలు విపరీతంగా ఉండడం వల్ల పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు తాగునీటి వసతి సౌకర్యాలతో పాటు మహిళలు,పురుషులకు వేరుగా టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయా కేంద్రాలను పర్యవేక్షించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ పెంచేలా చూడాలన్నారు. పోలింగ్ రోజు ప్రతి ఓటు హక్కు కలిగిన వారంతా తమ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకొనేలా చూసుకోవాల న్నారు. ఎన్నికల నిబంధనలు తూచా తప్పకుండా పాటించడంతో పాటు అలసత్వం ప్రదర్శించవద్దని అధికారులను కలెక్టర్ హెచ్చరించారు.అదేవిధంగా గతంలో గ్రామంలో ఉన్నటువంటి బైండోవర్ కేసుల గురించి అన్నిటిని వివరంగా అడిగి తెలుసుకున్నారు.అంతేకాకుండా ఏపార్టీలకు సంబంధించినటువంటి పోస్టర్లు మరియు గోడలపై రాతలు ఉండకూడదని, తెలియజేశారు.అలాగే ఎవరు కూడా ఎలక్షన్ కోడ్ ను నిబంధనలను ఉల్లంఘించకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు.అటువంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై వెంటనే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఓ.ఎస్.డి అనిల్ కుమార్ రెడ్డి,పులివెందుల ఆర్డీవో,వేముల తహసిల్దార్ ఎం.భగవతి, వేముల ఎస్సై ధనుంజయులు,మండల ఆర్ ఐ,వీఆర్వోలు మరియు తదితరులు తదితరులు ఉన్నారు.

# ఎన్నికల నియమావళి ఉల్లంఘన

## ఇద్దరిపై ఎఫ్.ఐ.ఆర్. నమోదు

## జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు



కడప మన జనప్రగతి మార్చి 18 : - ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన ఇరువురిపై ఎఫ్. ఐ. ఆర్. నమోదు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ ఎన్నికలు -2024కు సంబంధించి కేంద్ర ఎన్నికల కమీషన్ ఈ నెల 16న షెడ్యూలు ప్రకటించిన నాటి నుండి.. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎం.సి.సి.) అమలుపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కాగా ఆదివారం ప్రొద్దుటూరు నియోజకవర్గం (132) పరిధిలోని ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో.. ఆదివారం దూదేకుల సంఘం తరపున మహిళలకు చీరెల పంపిణీ కార్యక్రమం జరిగిందని.. ఆ కార్యక్రమం నిర్వహించుకునేందుకు ఎలాంటి అనుమతులు లేకపోవడం.. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన చర్యగా.. సోమవారం కొన్ని దినపత్రికలలో వార్త ప్రచురితమైందన్నారు. ఈ విషయంపై జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం సీరియస్ గా స్పందించి విచారించడం జరిగిందన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఎన్నికల కోడ్ ఉల్లంఘించి చీరెల పంపిణీ కార్యక్రమం నిర్వహించిన పగిడాల దస్తగిరి, సి.నాగూర్ లపై.. ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్, ఆర్.ఓ.ల ఫిర్యాదుల మేరకు.. టు టౌన్ పోలీస్ స్టేషన్ లో ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమాలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోక తప్పదని.. ఎన్నికల విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ భద్రతపై ప్రత్యేక దృష్టి అవసరం

## జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు



కడప మన జనప్రగతి మార్చి 18:- ఎన్నికల్లో ఓటింగ్ ప్రక్రియ ఎంత పకడ్బందీగా చేపట్టడం జరుగుతుందో.. అంతే జాగ్రత్తగా.. బ్యాలెట్ యూనిట్లను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లాఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు.సోమవారం కమలాపురం పట్టణంలోని డా. బి.ఆర్ అంబెడ్కర్ గురుకుల పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ / రిసెప్షన్ కేంద్రాన్ని, అసెంబ్లీ నియోజకవర్గ స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ ఫార్మ్స్ భద్రపరిచడం కోసం.. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్, నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ జి.గణేష్ కుమార్, ఎన్నికల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు.. రోడ్ మ్యాప్, అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఎన్నికల ప్రక్రియలో ఓటింగ్ కార్యక్రమాన్ని ఎంత పకడ్బందీగా నిర్వహిస్తామో.. పోలింగ్ జరిగిన అనంతరం నియోజకవర్గ బ్యాలెట్ యూనిట్స్ ను కూడా అంతే భద్రంగా.. స్టాంగ్ రూమ్ కు చేర్చడం జరుగుతుందన్నారు. అందుకోసం కమలాపురంలోని డా.బి.ఆర్ అంబెడ్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్ ను అత్యంత భద్రత కల్పించే ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందన్నారు. ఆ మేరకు స్ట్రాంగ్ రూమ్ భద్రత పై రిటర్నింగ్ అధికారులు కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నోడల్ ఆఫీసర్, స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి ఎన్.సుధాకర్, ఏ.ఆర్.ఓ, కమలాపురం తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, పోలీస్, రెవిన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.